

కోరాపుట్ సెక్షన్‌లో తనిఖీలు

విశాఖపట్నం–కోరాపుట్ సెక్షన్ పరిధిలో వాల్తేర్ డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి శనివారం తనిఖీలు చేపట్టారు. 8లో



దుర్గాలమ్మ.. పాహిమాం

వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం పెద్ద ఎత్తున పూజలు జరిగాయి. 8లో



అలరించిన నృత్య ప్రదర్శన

బీచ్‌రోడ్డులోని అన్నమయ్య విగ్రహ ప్రాంగణంలో శాస్త్రీయ నృత్య కళాకారుల నృత్య ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. 8లో

న్యూస్‌రీల్

శంకరమఠంలో టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి పూజలు



విజయేంద్ర సరస్వతి స్వామికి తిరుపతి ప్రసాదం అందజేస్తున్న టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి

సీతంపేట: మహా శివరాత్రి, కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి జన్మదినం కావడంతో టీటీడీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి శనివారం శంకరమఠంకు విచ్చేశారు. స్వామి వారిని దర్శించి, అక్కడ యాగశాలలో జరుగుతున్న పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతి ప్రసాదాన్ని స్వామి వారికి అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆయనతో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కె.కె.రాజు పాల్గొన్నారు.

23న జెడ్పీ సమావేశం

మహారాణిపేట: జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశానికి ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చింది. ఈనెల 23న మధ్యాహ్నం 3 గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షత సమావేశం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వచ్చే నెల 13న ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో సమావేశ నిర్వహణపై ఇటీవల జెడ్పీ సీఈవో శ్రీరామ్మూర్తి ఎన్నికల కమిషన్‌కు లేఖ రాశారు. గతంలో సర్వ సభ్య సమావేశం నిర్వహించి 90 రోజులు పూర్తి కావడంతో ఈనెల 23న సమావేశం నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ షరతులతో అనుమతి ఇచ్చింది. తీర్మానాలు, అభివృద్ధి పనుల ప్రతిపాదనలు పెట్టరాదని పేర్కొంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పసికందు మృతి ఘటనలో సీసీ ఫుటేజ్ పరిశీలన

మహారాణిపేట: కేజీహెచ్‌లో పసికందు మృతి, ద్విచక్ర వాహనంపై మృతదేహం తీసుకెళ్లిన ఘటనకు సంబంధించి ఆస్పత్రిలోని మెయిన్ గేటు, పిల్లల వార్డు, క్యాజువాల్టీ ఎస్టీ సెల్ తదితర విభాగాల్లో సీసీ ఫుటేజీలను సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్, ఆర్‌ఎంవో వాసుదేవ శనివారం పరిశీలించారు. ఈ ఘటనపై నియమించిన కమిటీ సభ్యులు డిప్యూటీ సూపరింటెండెంట్ రాధాకృష్ణ, ఆర్‌ఎంవో వాసుదేవ సోమవారం నుంచి విచారణ చేపట్టనున్నారు. ప్రభుత్వ వైద్యులు, నర్సులు, సెక్యూరిటీ, ఎస్టీ సెల్ సిబ్బందిని విచారించనున్నారు. కేజీహెచ్ పిల్లల వార్డులో పసికందు మృతి సమయంలో డ్యూటీలో ఉన్న హెడ్ నర్సు, స్టాఫ్ నర్సులకు సూపరింటెండెంట్ ఛార్జ్ మెమో జారీ చేశారు.

స్టీల్‌ప్లాంట్ కోసం పునరంకితులు కావాలి



మొక్కకు నీరు పోస్తున్న సీఎండీ అతుల్ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కోసం ఉద్యోగులు పునరంకితులు కావాలని సీఎండీ అతుల్ భట్ పిలుపునిచ్చారు. ఉక్కు మల్టీపర్పస్ హాలులో శనివారం జరిగిన స్టీల్‌ప్లాంట్ ఆవిర్భావ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ ఉత్పత్తి విభాగాల్లో అనేక రికార్డులు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. రాయబరేలీ ప్లాంట్‌లో అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టు ఎల్‌హెచ్‌బీ వీల్స్ తయారు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఇటీవల దొంగను పట్టుకునే ప్రయత్నంలో ధైర్యసాహసాలు ప్రదర్శించిన బీఎఫ్ డీజీఎం జీవీఆర్ మనోహర్‌రెడ్డికి అవార్డు అందజేశారు. వేడుకల్లో భాగంగా మార్కెటింగ్ సీడీవై యార్డ్‌లో సీఎండీ, డైరెక్టర్లు మహంతి, వీవీ వేణుగోపాలరావు మొక్కలు నాటారు.

నీలకంధరా దేవా



నీలం వేప చెట్టురోడ్డులో ఏర్పాటు చేసిన సెట్

- ఘనంగా మహా శివరాత్రి
- శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

హరహర మహాదేవ.. శంభోశంకరా.. అంటూ హోరెత్తిన శివ నామస్మరణ మనసుకు ప్రశాంతతతో పాటు ఆత్మను తేజోమయం చేసింది. ఆదిభిక్షువు దర్శనం దివ్యానుభూతిని కలిగించింది. భోళాశంకరా మా కోరికలు ఈడేర్చు తండ్రీ... ముక్కంటీ నీ చల్లని దృక్కులు మాపై ప్రసరించు స్వామీ.. అంటూ భక్తులు శివుణ్ని ప్రసన్నం చేసుకోవడానికి వేకువజాము నుంచే ఆలయాలకు బారులుతీరారు. మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని నగర, గ్రామీణ ప్రాంతాల్లోని శైవక్షేత్రాలన్నీ ఓ నమఃశివాయ స్మరణతో ప్రతిధ్వనించాయి. ఉదయం నుంచి బిల్వార్చనలు, విశేష అభిషేకాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, వేదమంత్రోచ్ఛరణల మధ్య విశేష పూజలు జరిగాయి. పలు సేవా సంఘాలు ఆలయాల వద్ద పాలు, అల్పాహారం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఆదిదంపతుల కల్యాణ మహోత్సవాన్ని తిలకించిన భక్తులు హరోంహరా.. అంటూ పరవశించారు.



ధ్వజస్తంభం వద్ద భక్తుల దీపారాధన



ఎంవీపీకాలనీలోని పార్వతీముక్తేశ్వర ఆలయంలో శివలింగాలకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు



నందీశ్వరుడికి ఓ భక్తురాలి నివేదన

హోరెత్తిన సాగరతీరం



బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన భారీ శివలింగానికి మొక్కుకుంటున్న భక్తులు

- ఘనంగా మహా కుంభాభిషేకం
- భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

బీచ్‌రోడ్డు: శివ నామస్మరణతో సాగరతీరం హోరెత్తింది. ఉదయం ఐదు గంటల నుంచే తీరానికి భక్తులు తరలివచ్చారు. మహా శివరాత్రి సందర్భంగా టి.సుబ్బరామిరెడ్డి కళాపీఠం ఆధ్వర్యంలో ఆర్.కె.బీచ్‌లో ఏర్పాటు చేసిన మహా కుంభాభిషేకంలో వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉదయం ఐదు గంటలకు పంచామృతం, సుగంధ ద్రవ్యాలు, పళ్లరసాలతో కోటి ఎనిమిది లక్షల లింగాలతో ఏర్పాటు చేసిన మహా శివలింగానికి కుంభాభిషేకం చేశారు. మధ్యాహ్నం శివుడికి ఏకాంత సేవ, కల్యాణం జరిగింది. అనంతరం మహా హోమం, పూర్ణాహుతి జరిపించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు పసుపు తాళ్లు, రుద్రాక్షలు పంపిణీ చేశారు. ఈ మహా కుంభాభిషేకానికి నగరానికి చెందిన ప్రముఖులు హాజరయ్యారు.



పసుపు నీళ్లతో అభిషేకం చేస్తున్న భక్తులు

ఉత్తమ వైద్య సేవలే లక్ష్యం

- యూపీహెచ్‌సీ ప్రారంభోత్సవంలో కలెక్టర్ మల్లికార్జున

మధురవాడ: వైద్యులు, వైద్య సిబ్బంది చక్కగా సేవలు అందించి యూపీహెచ్‌సీల ఏర్పాటు లక్ష్యాన్ని నెరవేర్చాలని కలెక్టర్ మల్లికార్జున కోరారు. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో రూ.1.29 కోట్లతో నిర్మించిన అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)ను జీవీఎంసీ కమిషనర్ రాజాబాబుతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో సిబ్బంది సరిపడా ఉన్నారా..? లేదా..?, అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. నిర్వహణ, సిబ్బంది పనితీరును సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న భూ సర్వేతో నగరంలోని ప్రభుత్వ భూములు, పార్కులు, గెడ్డలకు మరింత రక్షణ ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, ఎస్ఈ శ్యామ్‌సన్ రాజు, జెడ్సీ కనక మహాలక్ష్మి, ఈఈ మత్స్యరాజు, సీఎంహెచ్‌వో శాస్త్రి, వెటర్నరీ ఆఫీసర్ కిశోర్, డీఈ శ్రీహరి, ఏఈ ఎమ్.వెంకటరావు, మధురవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



యూపీహెచ్‌సీ వైద్యులు, సిబ్బందితో కలెక్టర్ మల్లికార్జున, కమిషనర్ రాజాబాబు

ప్రీ ప్రైమరీ స్కూళ్లపై ఫోకస్

- ఎల్‌కేజీ, యూకేజీ చదువులకూ గుర్తింపు
- చైల్డ్ ఇన్ఫోలో విద్యార్థుల సమగ్ర వివరాలు నమోదు
- ఇప్పటికే 33,956 మంది వివరాల సేకరణ
- విశాఖలో అనుమతుల్లేని 96 ప్లే స్కూళ్లలో సుమారు 6 వేల మంది చిన్నారులు
- అడ్డగోలు ఫీజులకు అడ్డుకట్ట వేసేలా చర్యలు

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానం అమలుకు సిద్ధమైన ప్రభుత్వం ఎల్‌కేజీ, యూకేజీ చదువులకు సైతం గుర్తింపు ఇచ్చేలా కసరత్తు చేస్తోంది. ప్రాథమిక పాఠశాలలకు అంగన్‌వాడీలను అనుసంధానంతో ప్రీ ప్రైమరీ స్కూళ్లను బలోపేతం చేయడం.. ఇదే చోట ఇంగ్లిష్ మీడియం చదువులకు పటిష్టమైన పునాదులు వేసేలా ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో నిర్వహిస్తున్న ప్రీ ప్రైమరీ, ప్లే స్కూళ్ల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రైమరీ స్కూళ్లలో చదువుకునే విద్యార్థుల వివరాలు చైల్డ్ ఇన్ఫోలో నమోదు ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ఇప్పటివరకు అందిన నివేదికల మేరకు విశాఖ జిల్లాలో ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో ఎల్‌కేజీలో 15,916 మంది, యూకేజీ 18,040 మంది చదువుతున్నట్లు విద్యాశాఖాధికారులు గుర్తించారు.

అధిక ఫీజుల వసూళ్లపై చర్యలు

కార్పొరేట్, ప్రైవేటు యాజమాన్యాల ఆధ్వర్యంలో ఎటువంటి అనుమతుల్లేండానే ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను నిర్వహిస్తున్నారు. ఎల్‌కేజీ చదువుకే ఏడాదికి రూ. లక్ష ఫీజు వసూలు చేస్తున్నారు. నగరంలోనే ఎక్కువగా ఇలాంటి స్కూళ్లు ఉన్నాయి. వాస్తవంగా అయితే 1 నుంచి 10 తరగతి వరకు మాత్రమే గుర్తింపు ఉన్న ప్రైవేట్ స్కూళ్లలో ఎల్‌కేజీ, యూకేజీ చదువులు నిర్వహిస్తుండటం నిబంధనలకు విరుద్ధం. అంతేకాకుండా ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తుండడంపై తల్లిదండ్రుల నుంచి వస్తున్న ఫిర్యాదులతో విద్యాశాఖాధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఎల్‌కేజీ, యూకేజీ తరగతులకు ఎంత ఫీజు నిర్ణయించాలనే దానిపై కసరత్తు చేస్తున్నారు.

ప్లే స్కూళ్లపై ఆరా

విద్యా వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్లే స్కూళ్ల వివరాలను సైతం విద్యాశాఖాధికారులు సేకరిస్తున్నారు. విశాఖ జిల్లాలో 96 ప్లే స్కూళ్లలో సుమారు 6 వేల మంది చిన్నారులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. వీటికి ఏ విధమైన అనుమతులు లేవు. తల్లిదండ్రుల్లో ఉన్న క్రేజ్‌తో ప్లే స్కూల్ నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. స్కూళ్లలో సరైన భద్రత చర్యలు కూడా తీసుకోవడం లేదు. ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు చదువుతున్న చిన్నారుల మాదిరే.. ప్లే స్కూళ్లకు వెళ్తున్న పిల్లల వివరాలు కూడా అధికారికంగా ఎక్కడా నమోదు కావడం లేదు. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేలా అధికారులు ప్లే స్కూళ్లపై దృష్టి సారించారు.

అంగన్‌వాడీల అనుసంధానం

జిల్లాలో 776 అంగన్‌వాడీల ద్వారా 7 నెలల నుంచి 6 ఏళ్ల మధ్య వయసు గల 65,830 మందికి సేవలు అందిస్తున్నారు. ఇందులో 13,664 మంది చిన్నారులకు ప్రీ స్కూళ్ల పేరిట ఆటపాటలతో చదువులు చెబుతున్నారు. వీరి వివరాలు ఇప్పటి వరకు ఐసీడీఎస్ అధికారుల వద్దనే ఉన్నాయి. ఎన్‌ఈపీ అమల్లో భాగంగా అంగన్‌వాడీల్లోని పిల్లల సమగ్ర వివరాలను సైతం చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేస్తున్నారు. విద్య, స్త్రీ శిశు సంక్షేమశాఖాధికారులు ప్రీ స్కూళ్ల నిర్వహణపై పర్యవేక్షణ చేయనున్నారు. ఈ మొత్తం ప్రక్రియ పూర్తయితే ఐదేళ్ల లోపు వయసు గల పిల్లల లెక్క పక్కాగా తేలనుంది.



మధురానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

మంచి నిర్ణయమే..



జాతీయ విద్యా విధానం అమలుతో ప్రీ ప్రైమరీ విద్యను పటిష్టం చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకనే ప్రైవేటు స్కూళ్లలో ప్రీ ప్రైమరీ చదువుతున్న వారి వివరాలను సేకరించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి. ఇది మంచి నిర్ణయమే. జిల్లా విద్యాశాఖాధికారుల ఆధ్వర్యంలో వివరాలు సేకరిస్తున్నారు.

– జ్యోతి కుమారి, ఆర్జేడీ, విశాఖపట్నం రీజియన్

పక్కాగా వివరాల సేకరణ



ప్రీప్రైమరీ స్కూళ్లలో చదువుతున్న పిల్లల సమగ్ర వివరాలను సేకరిస్తున్నాం. ప్రైవేటు స్కూళ్లలో ఇప్పటికే వివరాలు సేకరించాం. పూర్తి స్థాయిలో పరిశీలన చేసేలా ఎంఈవోల పర్యవేక్షణలో సీఆర్పీలకు బాధ్యతలు అప్పగించాం. ప్లే స్కూళ్ల వివరాలు కూడా సేకరిస్తున్నాం.

– ఎల్. చంద్రకళ, డీఈవో

సుందరీకరణ పనులు వేగవంతం

- జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

డాబాగార్డెన్స్: నగర సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ అనంతశంకర్‌తో కలిసి శనివారం జోడుగుళ్లపాలెం నుంచి రాడిసన్ బ్లూ హోటల్ వరకు పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జీ–20 సదస్సుకు దేశ విదేశాల నుంచి దాదాపు 200 మంది అతిథులు వస్తున్నట్లు చెప్పారు. వారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు నగర సుందరీకరణ పనులు, అటవీ శాఖ స్థలాల్లో వారి అనుమతితో నిర్దేశిత కాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. అవసరమైతే అదనపు సమయం వెచ్చించాలని సూచించారు. ముఖ్యంగా పారిశుధ్యం, మొబైల్ టాయిలెట్స్, విద్యుత్ దీపాలంకరణ, పెయింటింగ్, పచ్చదనాన్ని పెంపొందించడం, మొక్కల ట్రిమ్మింగ్, ఇంజినీరింగ్ పనులు త్వరితగతిన చేపట్టాలన్నారు. నిర్దేశించిన బీచ్‌ల్లో సందర్శకులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయడంతో పాటు.. ఒక క్రమపద్ధతిలో చిరు వ్యాపారులు వ్యాపారం చేసుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు, సబ్ డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ ధర్మరక్షిత్, చీఫ్ సిటీ ప్లానర్ బి.సురేష్‌కుమార్, డీడీహెచ్ ఎం.దామోదరరావు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ఇంజినీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.



ఫారెస్ట్ అధికారితో చర్చిస్తున్న కమిషనర్ రాజాబాబు

స్కేటింగ్ ఓవరాల్ చాంప్ ఎండీయూ

విశాఖ స్పోర్ట్స్: అంతర వర్సిటీల రోలర్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ ఓవరాల్ చాంప్‌గా ఎండీయూనివర్సిటీ (రోహతక్) నిలిచింది. మెన్‌లో ఎండీయూనివర్సిటీ, వుమెన్‌లో ఏయూ జట్టు చాంప్‌గా నిలిచాయి. ఏయూ ఆధ్వర్యంలో రింక్, రోడ్, రోలర్‌హాకీ, ఇన్‌లైన్ హాకీ, స్కేట్ బోర్డ్ అంశాల్లో నిర్వహించిన పోటీలు శనివారంతో ముగిశాయి. పోటీల ముగింపు కార్యక్రమానికి ఏయూ ఎగ్జిక్యూటివ్ మెంబర్, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ శోభాశ్రీ హాజరై విజేతలకు ట్రోఫీలందించారు. ఈ కార్యక్రమంలో ఏయూ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి విజయ్ మోహన్, ఏయూపీఈ విభాగపు హెచ్‌వోడీ పల్లవి, స్కేటింగ్ సంఘం ప్రతినిధులు భగీరథ్,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. రోలర్ హాకీ మెన్‌లో అలీఘర్ ముస్లింవర్సిటీ, వుమెన్‌లో ఆంధ్రాయూనివర్సిటీ, ఇన్‌లైన్‌మెన్ హాకీలో జమ్మూవర్సిటీ, వుమెన్‌లో సిహెచ్.దేవిలాల్ వర్సిటీ జట్లు విజేతగా నిలిచాయి.

బాలికపై దాడి చేసిన యువకుడిపై పోక్సో కేసు

పెదగంట్యాడ (గాజువాక) : బాలికపై దాడి చేసిన సంఘటనలో ఓ యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. న్యూపోర్టు స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సిద్ధేశ్వరానికి చెందిన ఓ బాలిక (13) నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. అదే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న తన అక్కతో కలిసి రోజూ పాఠశాలకు వెళ్లి వస్తుంటుంది. సిద్ధేశ్వరానికి చెందిన అప్పారావు అలియాస్ సంతోష్ (27) ఏడాదిగా ఆ బాలిక వెంట పడుతున్నాడు. ప్రేమిస్తున్నానంటూ వేధిస్తున్నాడు. మూడు నెలల క్రితం బాలికకు చాక్లెట్ ఇస్తానని చెప్పడంతో దానిని తీసుకోవడానికి అంగీకరించలేదు. దీంతో కోపం పెంచుకున్న అప్పారావు ఈ నెల 16న సాయంత్రం 5 గంటల సమయంలో స్కూల్ నుంచి ఇంటికి వస్తున్న బాలికను అడ్డుకున్నాడు. చాక్లెట్ ఇస్తానంటే ఎందుకు తీసుకోవడం లేదని గద్దించాడు. అంతేకాకుండా బాలిక చెంప మీద కొట్టాడు. దీంతో ఆ బాలిక తల్లిదండ్రులకు విషయం చెప్పింది. వెంటనే న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు అప్పారావు అలియాస్ సంతోష్‌ను అదుపులోకి తీసుకుని పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

సముద్రతీర ప్రాంతాల్లో బందోబస్తు

మురళీనగర్: శివరాత్రి సందర్భంగా శనివారం జాగరణ అనంతరం ఆదివారం వివిధ ప్రాంతాలకు పుణ్యస్నానాలకు వచ్చే భక్తుల రక్షణకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు నగర పోలీసు కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ దేవాలయాల వద్ద, సముద్ర తీరాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈ మేరకు ఆయన ఆర్‌కే బీచ్ సముద్ర తీర ప్రాంతాన్ని శనివారం రాత్రి సందర్శించి భద్రతా చర్యలపై ఆరా తీశారు.

అలరించిన శివోహం నృత్య ప్రదర్శన

మద్దిలపాలెం : శివోహం పేరిట మహాశి రాత్రి సందర్భంగా బీచ్‌రోడ్డులోని అన్నమయ్య విగ్రహ ప్రాంగణంలో విశాఖ శాస్త్రీయ నృత్య కళాకారుల సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. కనకమహాలక్ష్మి శిష్యబృందం చేసిన నృత్య ప్రదర్శన అందరి మన్నలు పొందింది. హిమబిందు శిష్య బృందం కూచిపూడి నృత్యం, తులసీదాసు శిష్య బృందం, శ్రావణి శిష్య బృందం, శైలజా,మంజుశ్రీ, శ్రీదేవి, లక్షితల శిష్య బృందాలు నృత్యాలు అలరించాయి.

దుర్గాలమ్మ..పాహిమాం

ఆలయానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి ప్రతిమలతో ఊరేగింపు

డాబాగార్డెన్స్: పూర్ణామార్కెట్ దరి వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు పోటెత్తారు. వేకువ జాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భవానీ మాలలు వేసిన మాతలు తలపై పసుపు నీళ్ల బిందెలు పెట్టుకుని ఊరేగింపుగా ఆలయానికి విచ్చేసి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అభిషేకించారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, స్థానిక కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. అమ్మవారి జాతర ఉత్సవం ఆదివారం పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్టు ఈవో పేర్కొన్నారు. 26న మారువారం పురస్కరించుకుని అష్టోత్తర శత పదార్థ నివేదన ఉంటుందన్నారు.



నగర పురవీధుల్లో దుర్గాలమ్మ ఊరేగింపు



శూలాలతో భవానీల ప్రదర్శన



ఆకట్టుకున్న విచిత్ర వేషధారణలు

జగనే మళ్లీ సీఎం కావాలి

బైక్ యాత్ర చేస్తున్న సీఎం జగన్ అభిమాని



బైక్ యాత్ర సాగిస్తున్న సీఎం జగన్ అభిమాని వీరబాబు

డాబాగార్డెన్స్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షిస్తూ.. ఆయన అభిమాని హైదరాబాద్ నుంచి చేపట్టిన బైక్ యాత్ర శనివారం విశాఖ చేరుకుంది. పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గానికి చెందిన వీరబాబు ఖమ్మంలోని వజీర్ సుల్తాన్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చేశాడు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా ఇంజినీరింగ్ పూర్తి చేసిన ఆయన హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు ఎంతగానో నచ్చాయి. అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం జగన్ పెద్ద పీట వేస్తున్నారు. అందుకే మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలి. వైఎస్సార్ తనయుడిగా ఆయనపై ఉన్న అభిమానంతో బైక్ యాత్ర చేపట్టా..' అని వీరబాబు తెలిపాడు. వర్క్ ఫ్రం హోంలో భాగంగా నైట్ షిఫ్ట్‌లో ఉద్యోగం చేస్తూనే.. రోజుకు 100 నుంచి 125 కిలోమీటర్ల మేర బైక్ యాత్ర చేస్తున్నాడు. ఈ నెల 6న హైదరాబాద్‌లో యాత్ర ప్రారంభించగా.. విజయనగరం చేరడంతో ముగుస్తుంది. ప్రతి రోజూ ఉదయం 10 గంటలకు యాత్ర ప్రారంభించి సాయంత్రం 6 గంటల వరకు సాగిస్తున్నాడు.

విశాఖ-కోరాపుట్ సెక్షన్‌లో తనిఖీలు

తాటిచెట్లపాలెం: విశాఖ-కోరాపుట్ సెక్షన్ పరిధిలో శనివారం డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి పర్యటించారు. కేటరింగ్ యూనిట్లు, వెయిటింగ్ హాళ్లు, ప్రయాణికులకు అందుతున్న సదుపాయాలు, కార్యాలయాలు, అభివృద్ధి పనులు పరిశీలించారు. శివలింగపురం, అరకు, సుకు, కోరాపుట్ స్టేషన్లలో అందుబాటులో ఉన్న భద్రతా సంబంధిత వ్యవస్థలను గురించి తెలుసుకున్నారు. ఇటీవల గూడ్స్ రైలు పట్టాలు తప్పిన కోరాపుట్-సుకు పరిధిలో అధికారులతో కలిసి పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలపై అధ్యయనం చేశారు. ఏడీఆర్‌ఎం(ఇన్‌ఫ్రా) సుధీర్‌కుమార్ గుప్తా, సీనియర్ డివిజనల్ ఇంజినీర్(కో ఆర్డినేషన్) పి.కె.మహారాణ, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.